క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలో అన్నాన్‌పల్లి గ్రామానికి చెందిన కన్న నాయక్ కాలు సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాయం కోసం బాధిత కుటుంబ సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి స్పందించి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.1.25 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఈ మేరకు మంత్రి ఆస్పత్రి సహాయకుడు హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎల్‌ఓసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

హాస్టళ్లలో వైద్యశిబిరాలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని బీసీ బాలుర, ఎస్టీ బాలికల హాస్టళ్లలో వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. రెండు హాస్టళ్లలో వేర్వేరుగా 53 మందిని పరీక్షించి ముగ్గురి రక్త నమూనాలు సేకరించారు. మలేరియా రాపిడ్ టెస్టులు చేసి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిణి, హెల్త్ అసిస్టెంట్ అడప రాజరమణయ్య మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, మెదడువాపు, చికెన్ గున్యా, ఫైలేరియా వ్యాధులు వస్తాయని తెలిపారు. ఏఎన్‌ఎం హేమలత, వెంకటమ్మ, వార్డెన్లు సాంబయ్య, సరిత, ఆశ వర్కర్లు శైలజ, మాధవి, రుద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

'మావోయిస్టుల ఉనికే లేదు'

కాటారం: మావోయిస్టులకు ఈ ప్రాంతంలో ఉనికే లేదని వారి కాలం చెల్లిన సిద్ధాంతాలను ప్రస్తుతం ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని సీఐ నాగార్జునరావు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లోని కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ మాట్లాడారు. మావో సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో నిఘా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతం నుంచి మావోయిస్టు పార్టీలో ఏ ఒక్క అగ్రనేత లేరని అన్నారు. పోలీసులు యువతకు తోడ్పాటును అందించేలా కార్యక్రమాలు చేపడుతుండటంతో వారు అసాంఘిక శక్తుల వైపు చూడటం లేదన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

ఉచిత శిక్షణ

టేకుమట్ల: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్ మెకానిక్ కోర్సులో ఉచిత శిక్షణతో పాటు, ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ మైన బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్ మెకానిక్ నేర్చుకోవాలనుకునే యువతీ యువకులు 30 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, శిక్షణ అనతరం ఆటోమొబైల్ రంగంలో ఉద్యోగ అవకాశాలను సైతం కల్పింస్తుందని తెలిపారు. ఆసక్తి గల ఈ నెల 31లోపు విద్యార్హత, ఆధార్, పాస్ ఫొటోలతో పరకాల పట్టణంలోని జై హనుమాన్ మల్టీబ్రాండ్ కార్ కేర్ సేల్స్ అండ్ సర్వీసెస్‌లో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 90146 97041 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

శిరీష సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

ములుగు రూరల్ : ఖమ్మం జిల్లాలో ఉపాధ్యాయురాలు శిరీష సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ములుగు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శిరుప సతీష్ కుమార్, ఏళ్ల మధుసూదన్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యతో పాటు విద్యార్థి సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధి కోసం ఎంతో మంది ఉపాధ్యాయులు అనేక రకాలుగా కృషి చేస్తున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి పిల్లలను క్రమశిక్షణలో పెట్టాలనే ఉద్దేశ్యంతో కొన్ని సందర్భాల్లో విద్యార్థులను దండించాల్సి వస్తుంది అన్నారు. అటువంటి పరిస్థితుల్లో విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. క్రమశిక్షణలో పెట్టకపోతే విద్రోహశక్తులుగా మారే ప్రమాదం ఉంటుంది అన్నారు. శిరీష పై సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని వారు అన్నారు.

కూలిన పెంకుటిల్లు

మంగపేట : మండల కేంద్రం పరిధిలోని పొదుమూరుకు చెందిన దాగం సత్యం పెంకుటిల్లు సోమవారం సాయంత్రం నేల కూలింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఇంటికి తాళం వేసి కుమారుడితో కలిసి కన్నాయిగూడెం మండలంలోని గుర్రేవులలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లారు. వారం రోజుల నుంచి కుర్సున్న వర్షాలకు తడిసిన పెంకుటిల్లు సాయంత్రం ఒక్కసారిగా నెలకూలింది. ఇంట్లో ఎవరులేక పోవడంతో ప్రమాదం తప్పింది.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



పలిమెల: గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రామచందర్‌రావు

పలిమెల: అనుమానితులకు, కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని మహదేవపూర్ సీఐ రామచందర్‌రావు గొత్తికోయలకు సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా సోమవారం మండలంలోని ముకునూర్‌లోని గొత్తికోయగూడెంను సీఐ రామచందర్‌రావు, ఎస్సై తమాషారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులతో సీఐ మాట్లాడుతూ.. కొత్త వ్యక్తులను, అనుమానాస్పద వ్యక్తులను గోదావరి దాటించొద్దని, కొత్త వారి సమాచారం తప్పకుండా పోలీసులకు అందించాలని సూచించారు. మావోయిస్టులకు సాయం చేసిన, ఆశ్రయం కల్పించినా నేరం అని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున చేపల వేటకు వెళ్లొద్దన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలి

టేకుమట్ల: ప్రతి ఒక్కరూ అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గోగికారి ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని టేకుమట్ల–ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానితుల వివరాలను ఆధారాలతో గుర్తించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోకి అనుమానితులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అసాంఘిక వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తే కేసుల నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ తుల రమేశ్, చంద్రశేఖర్, మల్లన్న, కానిస్టేబుల్ మహేందర్, నాగరాజు, టీఎస్‌ఎస్పీ కానిస్టేబుళ్లు ఉన్నారు.



మహాముత్తారం: వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పెగడపల్లిలో వాహనాల తనిఖీ

మహాముత్తారం: మావోయిస్టుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని పెగడపల్లి వద్ద పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రధాన రహదారిపైన వచ్చిపోయే వాహనాలను ఎస్సై మహేందర్ కుమార్ ఆధ్వర్యంలో సోదాలు చేశారు. అనుమానితులను విచారించి వదిలేశారు. వాహన ధ్రువీకరణ పత్రాలు లేనివారి వివరాలు తీసుకున్నారు. ఆయన వెంట సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నారు.



టేకుమట్లలో..

సెలవు దినంగా ప్రకటించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున కాటారం కేంద్రంగా నిర్వహించే బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరుతూ.. సోమవారం భూపాలపల్లి మండలంలోని నందిగామ గ్రామంలో అంతర్జాతీయ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి ఆదివాసులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వాలకు సూచించినప్పటికీ అభివృద్ధి చేయడం చేయలేదన్నారు. కనీసం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆ రోజున సెలవు దినంగా ప్రకటించకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆగస్టు 9న అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ మాజీ సర్పంచ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం చిన్న రాజేందర్, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి గణేష్, రవి, విద్యార్థి సంఘం జిల్లా కమిటీ సభ్యులు తైనేని శ్రీరామ్, బొడ్డు సదానందం, లక్ష్మయ్య కాలప్పల్లి మల్లయ్య,తైనేని నాగేష్ గుండ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్సై శ్రావన్‌కుమార్, నాయకులు

చిట్యాల: హైదరాబాద్‌లో ఆగస్టు 8న నిర్వహించే సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు లావుడ్య రాజు నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలు శ్రావన్‌కుమార్, ఎండి.శాఖాన్ చేతుల మీదుగా కరపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు భుక్యా సురేష్ నాయక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ధరావత్ శారద బాయి, జిల్లా, మండల నాయకులు గుగులోతు వాలు, ధరావత్ రాజు, పార్వతి బాయి, సమ్మయ్య, రాకేశ్, పూర్ణ, కవిత, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం అందించాలని రాస్తారోకో



శాంతినగర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో ఉన్న విద్యార్థులకు, గ్రామస్తులకు విద్య, వైద్యం అందించాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్, వీకేసీ పార్టీ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ అంబాల అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శాంతినగర్ గ్రామంలో రాస్తారోకో చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శాంతినగర్ గ్రామస్తులకు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని కోరారు. గ్రామంలో విద్యార్థుల కోసం ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనాన్ని నిర్మించాలని అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా శాంతినగర్‌లో ఉన్న గ్రామస్తుల కోసం హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులు కనీసం ఐదు కిలోమీటర్లు వెళ్లి చదువుకోవాల్సి వస్తుందని అన్నారు. ఇక్కడ బస్సులు అపడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి శాంతినగర్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెరిపెల్లి విజయ్, పర్లపెల్లి శ్రీకాంత్, గ్రామస్తులు రాంబాబు, నవీన్, కిషన్, లక్ష్మి, జయమ్మ, సరోజన, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకుమట్ల: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా, మండల అధ్యక్షులు ఎల్కటి రాజయ్య, రేణుకుంట్ల రాములు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా చలో ఢిల్లీ–వంగపల్లి దీక్ష కరపత్రం సోమవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చలో ఢిల్లీ–వంగపల్లి దీక్షను ఆగస్టు 6న చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని, వర్గీకరణకు కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. 2014 ఎన్నికల ముందు బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని మోసం చేసిందని, ప్రస్తుతం 2024 ఎన్నికల సమయంలో కూడా ఎందుకు చేయలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా వర్గీకరణకు కట్టుబడి ఉండాలని లేని పక్షంలో నిరసన ధర్నా కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాజ్, రాజ్‌కుమార్, మహేందర్, ప్రభాకర్, కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌పై దురుసుగా ప్రవర్తించడం సరికాదు



మాట్లాడుతున్న టీఎస్ జేయూ నాయకులు

భూపాలపల్లి రూరల్: కాళేశ్వరం పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి ఓ జర్నలిస్ట్‌పై చేసిన వ్యాఖ్యలు సరికాదని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ జిల్లా కమిటీ పక్షాన తీవ్రంగా ఖండించారు. సోమవారం భూపాలపల్లి కాకతీయ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎస్ జేయూ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి జల్ది రమేశ్, రాష్ట్ర నాయకుడు పావుశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత శుక్రవారం కాళేశ్వరం సందర్శనకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పర్యటనకు వచ్చిన నేపథ్యంలో కవరేజ్‌కి వచ్చిన ఓజర్నలిస్ట్‌పై దురుసుగా ప్రవర్తించడం బాధాకరమాన్నారు. జర్నలిస్టులను చులకనగా చూడటాన్ని జర్నలిస్ట్ సమాజం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. సదరు జర్నలిస్ట్‌పై జగదీష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్ జేయూ నాయకులు మారపెల్లి చంద్రమౌళి, కనుకుల దేవేందర్, శేఖర్ నానీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'వెయ్యి కోట్ల బడ్జెట్ ప్రకటించాలి'



సమావేశానికి హాజరైన ఆటోడ్రైవర్లు

ములుగు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించే రాష్ట్ర బడ్జెట్‌లో ఆటో డ్రైవర్ల సంక్షేమానికి రూ.వెయ్యికోట్ల బడ్జెట్ ప్రకటించాలని ఆటో యూనియన్ జేఏసీ అధ్యక్షుడు మంద రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆటో యూనియన్ జిల్లాస్థాయి అత్యవసర సమావేశం యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల నరేష్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 31న అసెంబ్లీలో వినతి పత్రం ఇచ్చేందుకు తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అదుకోవాలని కోరారు. డ్రైవర్లకు ఇన్సూరెన్స్, బీమా, హెల్త్ కార్డుల సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హైమడ్ హరీశ్, ఓంకార్‌చారీ, కిరణ్, తిరుపతి, కుమార్, సాయి, సందీప్, నరేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్‌ఎస్‌తాడ్వాయి: సీజనల్ వ్యాధుల నివారణ కోసం మండలంలోని గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున మండలంలోని ప్రజలు వ్యాధుల భారిన పడి వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని అన్నారు. మండలంలోని బంధాల, లవ్వాల, కొండపర్తి, కాటపూర్ గ్రామాలలో డెంగీ, మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి వ్యాధులను నివారించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మాజీ సర్పంచ్ ఇర్స సునీల్‌దొర, సింగిల్ విండో డైరెక్టర్లు యానాల సిద్ధిరెడ్డి, జగదీశ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు భూషబోయిన రవికుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, నాయకులు పిట్టల మహేందర్, నేతాజీ పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ



మంగపేట: రేగులగూడెంలో..

వెంకటాపురం(కె): కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామచంద్రాపురం, రాచపల్లి, వీరభద్రవరం, ఉప్పేడు వీరాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సోహల్, వినయ్, అశీష్, స్నేహ, సిబ్బంది జ్యోతి, మనోహర్, యాకలక్ష్మి, తదితరులు ఉన్నారు.

మంగపేట: మండలంలోని కొత్తూరుమొట్లగూడెం పంచాయతీ పరిధిలోని రేగులగూడెం గొత్తికోయ కాలనీలో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారితో కలిసి సోమవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలం ముగిసే వరకు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి పంచాయతీ కార్యదర్శి పాషా ఆధ్వర్యంలో గ్రామంలోని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవితేజ, ఏఎన్‌ఎం జయలక్ష్మి, ఆశవర్కర్ సుజాత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామ పంచాయతీ మొద్దులగూడెం గ్రామంలో పిట్టల నర్సయ్య ఇల్లు ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. విషయం తెలు సుకున్న మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహా నాయక్ సంఘటన స్థలాని కి వచ్చి బాధితుడిని పరామర్శించి ఆర్థిక సా యంతో పాటు 50 కేజీల బియ్యం అందించా రు. ఈ సందర్భంగా గోవింద్ నాయక్ మాట్లాడుతూ.. కలెక్టర్‌తో మాట్లాడి నర్సయ్య కుటుంబానికి ఇల్లు మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆలూరి శ్రీనివాస్‌రావు, వెలిశాల స్వరూప, లావుడ్య రాంచందర్, ఓదేలు, భాస్కర్, గజ్జి ఎల్లేందర్, తాటికొండ శ్రీనివాస్ చారి, రమేశ్, వెంకన్న, శేఖర్, సమ్మయ్య, చంటి, సోమయ్య, వెంకట్రామ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపు నీరే దిక్కు!

ఆశ్రమ పాఠశాలలో నిరుపయోగంగా 'బోరు'

- నీటి కోసం ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



చేతిపంపు వద్ద నీరు తాగుతున్న విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో) మరమ్మతులకు నోచుకుని బోరు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని బయ్యక్కపేట ఆశ్రమ పాఠశాలలో బోరు మోటార్‌కు మరమ్మతు చేయకపోవడంతో విద్యార్థులకు చేతిపంపు నీళ్లే దిక్కవుతోన్నాయి. పాఠశాలలో సుమారుగా 110 మంది ఆదివాసీ గొత్తికోయ బాల, బాలికలు చదువుకుంటున్నారు. పాఠశాలలో ఉన్న బోరు మోటార్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో పాఠశాల ఆవరణలో ఉన్న చేతి పంపు నీటిని విద్యార్థులు తాగుతున్నారు. స్నానాలకు, మాల, మూత్ర విసర్జనకు చేతి పంపు నీటిని బాలికలు బకెట్ల ద్వారా తీసుకెళ్లి అవసరాలను తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బాలురు మాల విసర్జనకు పాఠశాల సమీపంలోని వాగు వద్దకు వెళ్తున్నారని గ్రామస్తులు తెలిపారు. వర్షకాలంలో వాగు ప్రాంతాలకు వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. చేతి పంపు వద్ద కనీసం ప్లాట్ ఫాం కూడా నిర్మించకపోవడంతో నీరు నిల్వ ఉండి అధ్వానంగా కనిపిస్తుంది. చేతి పుంపు వద్ద మురికి నీటితో విద్యార్థులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పాఠశాల తెరుచుకుని 48 రోజులు గడిచిన బోరుమోటార్ మరమ్మతులకు నోచుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుమోటార్ ను మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులపై పట్టింపేది?

పాఠశాలలోని విద్యార్థులపై అధికారులకు పట్టింపు లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం సెలవు కావడంతో పాఠశాలలో వంట మనుషులు, పాఠశాలలోని పని చేస్తున్న ఏఎన్‌ఎం మాత్రమే ఉన్నారు. వారి ఆలనాపాలనా చూసే వారు లేకపోవడంతో విద్యార్థులు పాఠశాల సమీపంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి దానిపై తిరగడం, మరికొంత మంది విద్యార్థులు పాఠశాల దాటి బయటకు వెళ్లి రోడ్ల వెంట తిరగడం కనిపించింది. సెలవు రోజున విద్యార్థులను కట్టడి చేసే వారే కరువయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం మొత్తం 40 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు తెలిసింది. మారుమూల ప్రాంతంలో పాఠశాల ఉండడంతో గిరిజన సంక్షేమశాఖ అధికారులు పర్యవేక్షించిన దఖాలాలు లేవని ఆదివాసీ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఐటీడీఏ కార్యాలయానికే అధికారులు పరిమితవుతున్నారు తప్ప పాఠశాలను సందర్శించి విద్యార్థుల కావాల్సిన కనీస సౌకర్యాల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో త్వరలో బదిలీల జరగడనుండంతో విద్యార్థుల సమస్యలను అధికారులు గాలికి వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి.

వాగులో కొట్టుకుపోయి పాడిగేదె మృతి



మృతి చెందిన పాడిగేదె

మహాముత్తారం: రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మండలంలోని కనుకునూర్ గ్రామానికి చెందిన భూపతి సదానందానికి చెందిన పాడిగేదె చెలిమెల వాగు దాటుతుండగా వరద తాకిడికి కొట్టుకుపోయింది. ఆదివారం పాడిగేదె సమాచారం కోసం గ్రామంలో తిరుగుతుండగా సింగంపల్లి అటవీ ప్రాంతంలోని వాగు వద్ద మృతి చెంది కనిపించింది. గేదె విలువ సుమారు రూ.20 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.